1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

జైపూర్ : సీజనల్‌గా వచ్చే వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ముస్తఫా సూచించారు. భీమారం మండలం కొత్తపల్లి, మద్దికల్, లాల్‌బహూదూర్‌పేట్‌లో గ్రామాలలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 16 మంది రక్త నమూనాలు సేకరించారు. వారంలో రెండు రోజులు నీటి పాత్రలను ఆరబెట్టుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలని, కాచి వడబోసిన నీరు తాగాలని తెలిపారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల గ్రామీణులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందికి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక గండి రామన్న సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కలిసి భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్లు, లైఫ్ జాకెట్లు తదితర సామాగ్రిని పరిశీలించి అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు.



సీసీఐ పునఃప్రారంభించేందుకు కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఐటీ టవర్‌తో వందలాది మందికి ఉద్యోగాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వెనకబడిన ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించేలా అన్ని రకాల సహాయ సహకారాలను కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఉదయం జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయనకు జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగ బ్రిడ్జిని సందర్శించారు. నదిలో వరద పరిస్థితిని గమనించి జిల్లా అధికార యంత్రాగానికి తగు సూచనలు చేశారు. రాష్ట్రంలో వానలు, వరదల పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మహబూబాబాద్ పర్యటనలో బిజీగా ఉండటంతో ఇక్కడి పరిస్థితిని సమీక్షించేందుకు తాను వచ్చానని తెలిపారు. వానలు, వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మానవ ప్రయత్నంలో లోపం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తులను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా వర్షాలు తగ్గు ముఖం పట్టిన తర్వాత పంట నష్టంపై సర్వే చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేస్తుందన్నారు. పెన్‌గంగ బ్రిడ్జిని సందర్శించి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డుపై తన కోసం ఎదురుచూస్తున్న కామాయి, మాండగడ గ్రామస్తులను కలిసి మంత్రి మార్గమధ్యలో మాట్లాడారు. గ్రామస్తులు తమకు రోడ్డు సౌకర్యం కావాలని, వరదలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని మంత్రికి విన్నవించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీసీఐ ఫ్యాక్టరీ సందర్శన...

జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సీసీఐ ఫ్యాక్టరీని సందర్శించారు. అక్కడి పరిస్థితులను జీఎంను అడిగి తెలుసుకున్నారు. గతంలోనే కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశంపై చర్చించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతం ఆదిలాబాద్‌లో ఉన్న ఏకైక పరిశ్రమ సీసీఐ అని అన్నారు. దాన్ని పునరుద్ధరించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ పునఃప్రారంభ అంశమై కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి విన్నవించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాబట్టి రాష్ట్రం తరపున ఎలాంటి సహకారం కావాలన్న ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఫ్యాక్టరి ప్రారంభమైతే చిన్న పరిశ్రమలు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు.



సీసీఐని పరిశీలించడానికి వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, కంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే శంకర్

30 సంవత్సరాలుగా మూతపడి ఉన్న సీసీఐని తిరిగి ప్రారంభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గతంలోనే కేంద్ర మంత్రులతో పాటు జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డికి విన్నవించడం జరిగిందన్నారు. వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. స్థానిక యువతకు ఫ్యాక్టరీ పునరుద్ధరణతో ఉపాధి లభిస్తుందన్నారు. ఒక సమయంలో ఏషియాలోనే పత్తి రంగంలో అగ్రగామిగా ఉన్న ఆదిలాబాద్ నేడు ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూత పడుతున్నాయని తెలిపారు. దీని కారణంగా ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలు జిల్లాపై శ్రద్ధ చూపించి ఫ్యాక్టరీని ప్రారంభించాలని కోరారు.

ఐటీ టవర్ నిర్మాణ పనులు పరిశీలన

ఆదిలాబాద్‌రూరల్ : పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డులో రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. పనుల వివరాలను ఇంజనీర్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మ్యాప్‌లను పరిశీలించి, త్వరతగతిన పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. మూడు ఎకరాల్లో టవర్ ఫేస్‌ను అభివృద్ధి చేయడంతో 537 మందికి ఉపాధి పొందవచ్చుని, నిర్మాణ పనుల్లో పురోగతి ఉందని పేర్కొన్నారు. జనవరి చివరి వరకు పనులు పూర్తి అవుతాయన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే పాయల శంకర్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఐటీ టవర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కేజీబీవీని సందర్శించిన డీఈఓ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం జిల్లా విద్యాధికారి యాదయ్య సందర్శించారు. కేజీబీవీలో అన్ని తరగతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్, పరీక్షలు, బోధన తరగతులు తదితర వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ అందరూ చక్కటి ప్రణాళిక ప్రకారం చదువుతూ 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలని తెలిపారు. తదుపరి కూడా ఉన్నత విద్య చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల తరగతి గదులు, వంటగది, పాఠశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. అనంతరం మండల ప్రాథమికోన్నత పాఠశాల గుల్లకోట, ప్రాథమిక పాఠశాల సూరారం సందర్శించారు. పాఠశాల తరగతి గదులు, పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించే బేస్‌లైన్, ఎస్ఎల్ఎస్, కనీస అభ్యసన సామర్థ్యాలు విద్యార్థులలో పెంపొందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కాసుల రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 59శాతం ఉత్పత్తి



నవతెలంగాణ-నస్పూర్

ఆగస్టు నెలలో శ్రీరాంపూర్ ఏరియాలో 59శాతం ఉత్పత్తి సాధించినట్లు ఇన్చార్జి జీఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు నెలలో వర్షాకాల ప్రభావంతో ఉపరితల గనులలో 3,20,000 టన్నులగాను 1,54,412 టన్నులు సాధించి 48 శాతం మాత్రమే ఉత్పత్తి సాధించగలిగామని తెలిపారు. గనులలో 1,34,900 టన్నులకుగాను 1,14,405 టన్నుల బొగ్గు తీసి 85 శాతం ఉత్పత్తి సాధించామని పేర్కొన్నారు. మొత్తంగా 4,54,900 టన్నులగాను 2,68,817 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 59శాతం ఉత్పత్తి సాధించామన్నారు. రానున్న రోజుల్లో ఉత్పత్తి 100శాతం సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన గ్రామస్తులు



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన వద్యాల భూమేష్ ఇల్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. రెక్కడితేకానీ డొక్కాడని కుటుంబం. వ్యాన్ తప్ప పంటపొలాలు కూడా లేవు. రోజు కూలీ చేసి కడుపు నింపుకుంటారు. ఇల్లు కూలడంతో పిల్లలు రోడ్డు మీదికి వచ్చారు. లోకేశ్వరం గ్రామ ప్రజలు ఐక్యత, సేవా బృందంతో మేం అండగా ఉంటామంటూ తలో వంద, రెండు వందల చొప్పున విరాళాలు జమ చేసి ఆ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. ప్రభుత్వం తరపున సాయం అందేలా అధికారులు చూడాలని గ్రామస్తులు కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్‌నాయక్

నవతెలంగాణ-నార్నూర్

భారీ వర్షాల నేపథ్యంలో నార్నూర్, గాదిగూడ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. 3 రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లు కొట్టుకుపోయి వాగుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. పశువుల కాపరులు, రైతులు, మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. భారీ వర్షంతో పాటు పిడుగులు పడే సూచనలు ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు బయటకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షానికి రోడ్డుపై గుంతలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి పడొచ్చుని, ఎక్కడైన విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి దివ్యశ్రీ ఫౌండేషన్ తరపున సాయం చేయాలని సభ్యులకు సూచించారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్ : స్కాలర్‌షిప్ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో రెన్యూవల్, ఫ్రెష్ దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటి నుండి డిసెంబర్ 31 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆ పత్రాలను జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైతులకు మంత్రి క్షమాపణ చెప్పాలి

- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మంత్రి శ్రీధర్‌బాబు భేషరతుగా ఆదిలాబాద్ రైతులకు క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపిలు ఏ టీం, బీ టీంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. మంత్రి పర్యటనలో ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రైతుల పక్షాన ప్రశ్నించకుండా వారితో కలిసి సీసీఐ సందర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక పక్క ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి పెన్‌గంగ పరివాహక ప్రాంతాల్లో పంటలు నష్టపోయి తీవ్ర నష్టాల్లో ఉన్న రైతాంగాన్ని పరామర్శించాల్సిన మంత్రి రైతులను నిరాశకు గురి చేశారన్నారు. రైతాంగం కష్టాలను పక్కనపెట్టి కమీషన్ల కోసం సిసిఐ పరిశ్రమను సందర్శించడం రైతులకు తీవ్ర ఆగ్రహాన్ని గురి చేస్తుందన్నారు. కామాయి గ్రామం నుండి మాండగడ రైతులు మినిస్టర్ రాక కోసం ఎదురు చూస్తూ ఉంటే రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వకుండా వెళ్లిపోవడం పట్ల రైతుల పట్ల వారికున్న విజ్ఞత స్పష్టమవుతుందన్నారు. బాధలో ఉన్న రైతులకు ధైర్యం చెప్పలేని మంత్రి పర్యటన ఎందుకని ప్రశ్నించారు. రైతుల ప్రక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి బిజెపి ఎమ్మెల్యే కమీషన్ల కోసం కాంగ్రెస్ మంత్రులతో సీసీఐ పరిశ్రమను సందర్శిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి కేటీఆర్ సీసీఐ నిర్వహణ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పజెప్పాలని ప్రతిపాదనలు పంపించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలలో కనీసం నాలుగు హామీలైన పూర్తి చేయాలని అసమర్థత ప్రభుత్వమని తెలిపారు. రైతు కూలీలకు రూ.12వేల సాయం, పూర్తి స్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా అందించేంత వరకు రైతుల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో రైతు సమన్వయ జిల్లా అధ్యక్షులు రోకండ్ల రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కొమ్రం రాజు, మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్, మెస్రం పరమేశ్వర్, అశోక్ స్వామి, మోబిన్, ఆసిఫ్, కొడప రాము పాల్గొన్నారు.



బాల సాహిత్య పుస్తకాలతో పఠనాసక్తి పెరుగుతుంది



నవతెలంగాణ-నిర్మల్

బాల సాహిత్య పుస్తకాలతో విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార పుస్తక వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. సంచార వాహనంలో చదవడానికి అందుబాటులో ఉంచిన పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ వాహనం పాఠశాలలు, అంగన్వాడీలు, గ్రామాలలోని ముఖ్య కూడళ్ల వద్ద పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, విద్యానైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు. విద్యార్థుల పుస్తక పఠన సామర్థ్యం పెంచడానికి కృషి చేస్తున్న రూమ్ టూ రీడ్ సంస్థను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఆర్వో భుజంగ్‌రావ్, డిఈఓ రవీందర్‌రెడ్డి, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌చార్జి రవి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్టీపీపీ అధికారికి సన్మానం



జైపూర్ : జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అడిషనల్ మేనేజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఎంఎస్‌వీ రమణను ప్లాంట్ అధికారలు ఘనంగా సన్మానించారు. 37 సంవత్సరాలు సింగరేణిలో వివిధ హోదాల్లో పని చేసిన రమణ ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక మీదుగా ఎస్టీపీపీ ఈడీ(హెడ్ ఆఫ్ దీ ప్లాంట్) ఎన్‌వీ రాజశేఖర్‌రావుతో పాటు పలువురు అధికారులు పూల గుచ్చాలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణిలో ఎన్నో కీలక హోదాలను సమర్థవంతంగా నిర్వహించి ప్లాంట్ అడిషనల్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్లాంట్ జీఎం కే శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓ అండ్ ఎం జేఎన్ సింగ్ తదితరులు సింగరేణి సంస్థలో రమణ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఘనంగా బడుగ వేడుకలు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని రేగులగూడ ఆదివాసీ గిరిజన గ్రామంలో రెండు రోజుల పాటు పొలాల అమావాస్య వేడుకల్లో భాగంగా మంగళవారం బడుగ పండుగను ఘనంగా నిర్వహించారు. ఎద్దులను శుభ్రంగా కడిగి, పసుపురాసి అందంగా అలంకరించి, హనుమాన్ ఆలయం చుట్టు తిప్పుతూ పూజలు చేశారు. పొలాల అమావాస్య రోజు భగవంతుడే సాక్ష్యాత్తు ఎద్దులను చూడటానికి వస్తాడని వారి నమ్మకం. అదే రోజు ప్రతి ఇంట్లో అమ్మవారికి ప్రత్యేక పిండి వంటలు, గారెలు వంటివి చేసి మూట కట్టి పక్కన పెట్టి గ్రామస్తులందరూ ఇంట్లో మూట కట్టి ఉన్న నైవేద్యాన్ని, వెదురుతో తయారు చేసిన కట్టెను ఊరి బయటనున్న అమ్మవారి ప్రదేశానికి తీసుకువెళ్తూ జాగేయ్ డోక్రి, జగేయ్ అనే నినాదాలు చేస్తారు. వర్షాకాలంలో ప్రబలే జ్వరాలు, వాంతులు, విరోచనాలు వంటి రోగాల నుండి విముక్తి పొందాలని, గ్రామంలో ఉన్న జబ్బులు, దోమలు పారిపోవాలని కోరుకుంటూ ఊరి బయటనున్న అమ్మవారి ప్రదేశానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. తమ వెంట తెచ్చుకున్న నైవేద్యాన్ని అంతా ఒకేచోట కలిపి తిని అక్కడున్న వన మూలికలను ఇంటికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ కుర్సెంగ సోనేరావు, గ్రామ పెద్దలు కొడప కాంతారావు, కుర్సెంగ వసంతరావు, కుర్సెంగ జైపంత్ రావు, తొడసం లక్ష్మణ్, గేడం వాసుదేవ్, సిడాం చంద్రకుమార్, గోవింద్, ప్రవీణ్, వంశీకృష్ణ, రాము, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. తాటిగూడలోనూ బడుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జగేయి మాతారి జగేయి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాటిగూడ గ్రామ పటేల్ మడావి శేఖర్, మడావి వెంకటేశ్, వెలాది అర్జు, మడావి గోపాల్, సిడాం కమలాకర్, మడావి రాజేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.





పౌష్టికరమైన ఆహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ-జైపూర్

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. ఇందారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పడంతో పాటు వారి తల్లిదండ్రులతో కథలు చెప్పించారు.. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సౌజన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి, కల్పన పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అక్రమాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. హైడ్రాను ఆదిలాబాద్‌లో విస్తరింపజేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా 49 వార్డులలో జరిగే ప్రభుత్వ ఆస్తులు, పార్కింగ్, లీజ్ స్థలాల ఆక్రమణల గురించి, ప్రజలు నిష్పక్షపాతంగా ధైర్యంగా వచ్చి కంప్లైంట్ చేయాలని కోరారు. అదేవిధంగా కొందరు ప్రభుత్వ స్థలాలు పార్కింగ్, లీజ్ స్థలాల కాకుండా ప్రయివేటు స్థలాలలో డివియేషన్ బిల్డింగ్ పర్మిషన్లపై కంప్లైంట్ చేసి, డబ్బులు అడుగుతున్నా అలాంటి వారిపై తగు చర్య తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు జహీర్ రంజాని, కలాల శ్రీనివాస్, సంద నర్సింగ్, లక్ష్మణ్, బండారి సతీష్, రామ్ కుమార్, భూమన్న, సంజయ్, ఇమ్రాన్ ఉన్నారు.



వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ కృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని జిల్లా క్షయ నివారణ కార్యాలయంతో పాటు, స్థానిక రిమ్స్‌లోని లాబొరేటరీ, ఏఆర్టీ సెంటర్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బంది పనితీరును సంబధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. రోగులకు రిపోర్టులను సకాలంలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీధర్, డాక్టర్ సాయిప్రియ, బండారి కృష్ణ ఉన్నారు.



పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణేష్ నవరాత్రులు, మిలాద్ ఉన్ నబి వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మత సంఘాల పెద్దలు, పోలీసు రెవెన్యూ విద్యుత్తు, ఎక్సైజ్, మున్సిపల్, ఫైర్, నీటిపారుదల శాఖల అధికారులు సంబంధిత శాఖల అధికారులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా హిందూ, ముస్లిమ్ మత పెద్దల అభిప్రాయాలను, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 11 రోజుల పాటు జరిగే వినాయక నవరాత్రి వేడుకలు, 17న జరిగే మిలాద్ ఉన్ నబి వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలని, ముఖ్యంగా మున్సిపల్‌శాఖ సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, మొబైల్ టాయిలెట్స్ నిమజ్జనం రోజూ ఏర్పాటు చేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, బ్లీచింగ్ పౌడర్, తదితర ఏర్పాట్లు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో అవసరం మేరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. గణేశ మండపాల వద్ద రాత్రి పూట ఇద్దరు ఉండేలా చూడాలని, వైద్యశాఖ ద్వారా మెడిసిన్ కిట్ ఏర్పాటు, ఎక్సైజ్ శాఖ ద్వారా బెల్ట్ షాపులను పండుగ మొదటి రోజూ నుంచి చివరి రోజు వరకు మూసివేయాలని దీనిని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారిని ఆదేశించారు. విద్యుత్‌శాఖ ద్వారా సీఎం ఆదేశాల మేరకు ఫ్రీ కరెంట్ ఇవ్వడం జరుగుతుందని, 9440811700కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని విద్యుత్‌శాఖ అధికారి తెలిపారు.

సీసీ కెమెరాలతో నిఘా...

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సెక్యూరిటి ఏర్పాటు, పెట్రోలింగ్ మూడు షిఫ్టులుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ రాకుండా చూడాలని కోరారు. పంచాయతీ శాఖ ద్వారా లేబర్స్‌ని ఎక్కువగా నియమించాలని, ఈ విషయంలో మున్సిపల్, డీపీఓ సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అలాగే గజ ఈత గాళ్లను నియమించాలని తెలిపారు. పోలీస్‌శాఖ తరుపున శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, అందరి సహకారంతో ఈ రెండు పండుగలను శాంతియుత వాతవరణంలో విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీఓ వినోద్ కుమార్, జివాకర్ రెడ్డి, సంబంధిత అధికారులు, శాంతి కమిటి సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం



నవతెలంగాణ-నిర్మల్

బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆయన పర్యటించారు. బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జలమయమైన జీఎన్ఆర్ కాలనీని పరిశీలించారు. వర్షాలతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలా, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, నాయకులు, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు రాకపోకలకు అంతరాయం



నవతెలంగాణ-తలమడుగు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగాయి. మంగళవారం మండలంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి పారడంతో పంటలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పశువులు సైతం వర్షంలో ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మండల కేంద్రానికి అనుకొని ఉన్న పెద్దవాగు, భీమన్న వాగు, దేవాపూర్ రుయ్యాడి గ్రామాల మధ్యన గల వాగులు, పొంగిపొర్లయి. తహసీల్దార్ రాజమోహన్ స్థానిక పోలీసులు పొంగిపొర్లుతున్న వాగుల వద్దకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ మండల ప్రజలు భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగిన వెంటనే రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వాగుల సమీపానగల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండి వాగులను పరిశీలిస్తూ, గ్రామస్తులకు సమాచారం అందించి, అదేవిధంగా మండల అధికారులు కూడా సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అత్యావసర పనులు ఉంటేనే బయటకు వెళ్లాలని అన్నారు. పారుతున్న వాగుల నుంచి వంకల నుంచి దాటే ప్రయత్నాలు చేయవద్దని ప్రజలను కోరారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నవతెలంగాణ-తాంసి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) శివారులో పెన్ గంగా వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట చెలను అధికారులు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పెట్టుబడి, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడవద్దని అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా పంట నష్టం వివరాలను ఆరా తీసే క్రమంలో మండల వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం



చేశారు. ఎమ్మెల్యే వచ్చిన ఏఓ రాలేదు ఎందుకని అన్నారు. ఏఓ లేకుంటే నష్టం వివరాలు ఏలా తెలుసుకునేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను సర్వే చేసి వెంటనే గుర్తించాలన్నారు. ఎకరానికి రూ.40వేల పైన పరిహారం అందించాలన్నారు. మరో పంటసాగుకు రైతులకు ఎరువులు, విత్తనాలు అందించి ఆదుకోవాలని కోరారు. ప్రతియేటా పెన్‌గంగా నది బ్యాక్ వాటర్ ద్వారా పంట నష్టం జరుగుతుందని, నష్టం జరుగకుండా చర్యలు తీసుకునే విధంగా దృష్టి సారిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ గోపాలకృష్ణరెడ్డి, ఏఈఓ సాయిప్రసాద్, మండల నాయకులు నాగయ్య యాదవ్, కుమ్మ సుధాకర్, గడ్డం లస్మన్న, గోవర్ధన్ యాదవ్, తిరుమల్‌గౌడ్, లస్మయ్య యాదవ్, రవూఫ్, సంతోష్, గంగయ్య, నితిన్, అఫ్రోజ్, అనిల్ ఉన్నారు.

చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యం



నవతెలంగాణ-నార్నూర్

చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారమే ముఖ్యమని హెల్త్ సూపర్‌వైజర్‌లు చౌహాన్ చరణ్‌దాస్, గణేష్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో 0 నుంచి 6 సంవత్సరాల సామ్ మామ్ పిల్లలకు పై అదికారుల ఆదేశానుసారం కొలతలు చేసి గుర్తించారు. ఎత్తు బరువు చూశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి కొల శేఖర్, అంగన్‌వాడీ టీచర్ రాథోడ్ శ్యామక, ఆశా కార్యకర్తలు శ్రీలత, సంగీత, అనిత ఉన్నారు.

ఉత్సవాల లోగో ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని హిందూ సమాజ్ ఉత్సవ సమితి రూపొందించిన లోగోను ఎమ్మెల్యే పాయల శంకర్ ఆవిష్కరించారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్‌లోని ఆయన నివాసంలో సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి లోగోను విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, హైందవధర్మం, సంస్కృతి ఉట్టిపడేలా జరుపుకోవాలని సూచించారు. వీలైనంత వరకు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంపెల్లి హన్మండ్లు, కోరెడ్డి లెనిన్, భాస్కర్‌గౌడ్, ఉదయ్, విశ్వనాథ్, రాజ్‌కుమార్, నర్సింగ్, తిరుమలేష్, సాయి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిని నియమించాలి



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో తగు సిబ్బందిని నియమించాలని ముధోల్ మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్‌శాఖ ఏడీఈ లక్ష్మణ్, ఏఈ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు తగు సిబ్బంది లేక త్వరగా విద్యుత్ అందించడంలో విద్యుత్ అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. ముధోల్‌లో వ్యవసాయ భూమి ఎక్కువ ఉండటంతో విద్యుత్ నియంత్రికలు చూసి సరిచేయడంలో సమయం సరిపోక పంట వేసుకున్న రైతులు నష్టాల పాలు అవుతున్నారని అన్నారు. వచ్చే రబీ పంట వరకు తగు సిబ్బందిని కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మోహన్ యాదవ్, బత్తిన్ సాయినాథ్, శివాజీ, నరేష్, రమేష్, అరవింద్ పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదగాలి

- ఎస్పీ గౌస్ ఆలం
- పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా
- 300 మంది అభ్యర్థులు హాజరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉద్యోగంలో చేరి అంచలంచలుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో పట్టణంలోని సెంట్రల్ గార్డెన్ మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, మేళను ప్రారంభించారు. ఈ జాబ్ మేళా లో జీఎంఆర్ సంస్థ రక్ష సంస్థ వారి సహకారంతో టెన్త్‌పాస్ అయిన పురుషులు, మహిళలకు సెక్యూరిటీ గార్డులుగా అవకాశాలు అందించనున్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఒక నెల రోజుల పాటు శిక్షణను తీసుకొని జీఎంఆర్ సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న ప్రముఖ ఎయిర్ పోర్టులు, షిప్పింగ్ యార్డులు, కంపెనీలలో సెక్యూరిటీ గార్డులుగా విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ జాబ్ మేళాలో దాదాపు 500 మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల ప్రజలతో ఉద్యోగాలు నిర్వహిస్తూ ఉండటం వల్ల, రకరకాల ఉద్యోగాలను చేస్తూ, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల కోసం వేచి చూడకుండా వచ్చిన ప్రయివేటు రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, సీఐలు బి.సునీల్ కుమార్, కరుణాకర్, కే ఫణిదర్, శ్రీనివాస్, పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో చప్పన్ బోగ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పొలాల అమావాస్యను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీరాణి సతీజీ ట్రస్ట్ ఆధ్వర్యంలో చప్పన్ బోగ్ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తుల నడుమ నిర్వహించారు. ముందుగా అమ్మవారికి మహాహారతి ఇచ్చారు. అనంతరం 56 రకాల వంటకాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. లోకకళ్యాణార్థం కులమత బేధాలు లేకుండా 49 సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కమిటీ సభ్యులు గణేష్ లాల్ దేడియా, గోపిచంద్ దేడియా, సురేష్ దేడియా, మోహన్ దేడియా, జగదీష్ అగర్వాల్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే అభిమాని

- వినాయక విగ్రహానికి రూ.50వేలు విరాళం

నవతెలంగాణ-ముధోల్



ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అభిమాని అయిన స్థానిక యువనాయకుడు తాటివార్ రమేష్ కోరిన మొక్కు తీరడంతో రూ.50 వేల చెక్కును ముధోల్‌లోని చైతన్య యూత్ సభ్యులకు మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీగా చురుకుగా పని చేసి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పవార్ రామారావు పటేల్ గెలిస్తే వినాయక విగ్రహానికి డబ్బులు చెల్లిస్తానని తెలిపారు. దీంతో ఎమ్మెల్యేగా పవార్ రామారావు పటేల్ అఖండ విజయం సాధించడంతో మండల కేంద్రానికి చెందిన తాటివార్ రమేష్ అఖండ బ్రహ్మచారి చైతన్య యూత్ మండలి సభ్యులకు రూ.50 వేల చెక్కును అందజేసి మాట నిలబెట్టుకున్నాడు. దీంతో యూత్ సభ్యులు, పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు దప్కల్ సాయి యాదవ్, వెంకటేష్ గౌడ్, డాంగే గోపి పటేల్, యూత్ సభ్యులు మేకల సాయి, చందుసింగ్, తాటివార్ సంజు, రాజు, సాయి, బుషోళ్ల సాయి పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగపర్చుకోవాలి




నవతెలంగాణ-తలమడుగు

ప్రజలకు ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగపర్చుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. మంగళవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన ఝరి, పూనగూడ గ్రామాలలో ఆర్టీసీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణం రాయితీలపై విద్యార్థులకు, వికలాంగులకు బస్‌పాస్ పాసులు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వివాహ శుభకార్యాలకు రాయితీపై బస్సుల అందించడంతో పాటు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితంగా సుఖవంత ప్రయాణానికి మన ఆర్టీసీ పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ప్రబలుతున్న సీజనల్ వ్యాధులను అరికట్టుట గురించి, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీబీఓలు ఎం.శ్రీనివాస్, పి.రాము, మాజీ ఎంపీపీ ఎస్.రాము గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంట పొలాల్లోంచి ఫ్యాక్టరిని తరలించాలి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 43వ రోజుకు చేరాయి. నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంగళవారం ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఫ్యాక్టరీని అక్కడి నుంచి తరలించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీని పచ్చని పంట పొలాల్లో నిర్మిస్తున్నారని, రెండు పంటలు పండే తమ భూములు ఫ్యాక్టరీ కాలుష్యంతో పాడవుతాయని తెలిపారు. ఆ ప్రాంతంలో నిరంతరం వన్యప్రాణులు సంచరిస్తాయని, ఇథనాల్, థర్మల్ ప్రాజెక్టుల వన్యప్రాణులకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. 27 ప్యాకేజ్ ద్వారా పంట పొలాలకు నీరందించే కాలువల ద్వారా ఫ్యాక్టరీకి నీటిని తరలిస్తే పంట పొలాలకు నీరందడం కష్టతరంగా మారుతుందని పేర్కొన్నారు. పంట భూముల్లో ఏర్పాటు చేసే ఫ్యాక్టరీని తరలించేందుకు కృషి చేయాలని మంత్రిని వేడుకున్నారు. ఫ్యాక్టరీ కి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని, తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం

నవతెలంగాణ-ముథోల్

గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా ముథోల్‌లోని కోలిగల్లికి చెందిన గంగన్నకు చెందిన ఇల్లు, బొరిగాం గ్రామానికి చెందిన సైదుల నారాయణకు చెందిన ఇల్లు కూలిపోయింది. అయితే ప్రభుత్వ తరుపున తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున బాధితుల బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమచేసినట్టు ఆర్ఐ నారాయణ తెలిపారు. అలాగే మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన సూర్యవంశీ సదాశివ్ పటేల్ అనే రైతుకు చెందిన గేదే మేయడానికి వెళ్లి మచ్కల్ వాగులో కొట్టుకోపోయి మృతి చెందింది. దీంతో బాధిత రైతు అకౌంట్‌లో ప్రభుత్వ తరుపున రూ.37,500 లను మంగళవారం జమచేశామని ఆర్ఐ పేర్కొన్నారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీలో సభ్యత్వ నమోదు కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొండరి రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐబీ చౌరస్తాలో బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ తమ సభ్యత్వాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, బింగి వెంకటేష్, రాథోడ్ శేషారావు, లింగాగౌడ్, సాదిగె రాజేశ్వర్, పవార్ దేవిదాస్, తన్నీరు సతీష్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని కమాన గ్రామ శివారులో మంగళవారం పేకాట స్థావరాలపై ఎస్సై ప్రశాంత్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైతో కలిసి దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. కమాన గ్రామ శివారులో పేకాట ఆడుతున్న గ్రామానికి చెందిన లోబడె బాపురావు, సంతోష్, మస్నె తుకారాం, ఆదె అనిల్, బామినె రాఘవ, లోబడె చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుండి రూ.3200 నదును స్వాదీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గ్రామాల్లో పేకాట, మట్కా, అసంఘటిత కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పేకాట, మట్కా, గుట్కా, అసంఘటిత చర్యలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు షీ టీం పని తీరుపై షీ టీం సభ్యులు తిరుమల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, చట్టాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అత్యవసర సమయంలో 100కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలతో పాటు చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శైలజ, షీ టీం సభ్యులు సునీత, రమాదేవి, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల కల నెరవేరేనా..?

• మధ్యలోనే నిలిచిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లు • కొత్త ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు



మధ్యలోనే ఆగిన డబూల్ బెడ్ రూం పనులు

జిల్లాలో పేద ప్రజల సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. గత ప్రభుత్వం హయాంలో జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ ఈ రెండు నియోజకవర్గాలకు కలిపి 1400 ఇండ్లు మంజూరయ్యాయి. కానీ ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోక గుత్తేదారు మధ్యలోనే పనులను నిలిపివేశాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. లబ్ధిదారుల ఆశలు నిరాశలయ్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పూర్తి చేయకపోతుందా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ-వాంకిడి

నిరుపేదలకు సొంతింటి కల నెరవేరేటట్టు కనిపించడంలేదు. ఇండ్లు లేని వారికి రెండు పడక గదుల ఇండ్లు నిర్మించి ఇవ్వాలని భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణ సామాగ్రి ధరలు పెరిగిపోవడం, ప్రభుత్వం కేటాయించిన నిధులు నిర్మాణ పనులకు చాలకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. దీంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో నిరుపేదలు తీవ్ర నిరాశకు గురయ్యారు. గతేడాది జనవరి 2023 వరకు రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పంపిణీకి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే లాటరీ పద్ధతిలో ఎంపిక చేయాలని భావించినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులకు సొంతిండ్లు కలగానే మిగిలిపోయాయి.

జిల్లాకు 1400 ఇండ్లు మంజూరు...

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజకవర్గాలకు 700 చొప్పున కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 1400 డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించారు. తొలివిడతలో సిర్పూర్(టి) నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా కాగజ్‌నగర్ మండలంలో 480 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇందులో 288 ఇండ్లు చివరి దశలో ఉండగా మరో 192 వివిధ దశల్లో నిలిచిపోయాయి. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి మండలాలతో పాటు పలు ప్రాంతాల్లో పనులు ప్రారంభించిన ఎక్కడ కూడా పూర్తికాలేదు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. జిల్లాలో జిల్లాలో ఒక్క బిల్లు కూడా పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మధ్యలో నిలిచిపోయిన ఇండ్లను పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేద ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు...

డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. లబ్ధిదారు సొంతిల్లు లేని వారై ఉండాలి. అద్దె ఇండ్లలో కానీ, గుడెసెల్లో నివసిస్తుండాలి. తక్కువ ఆదాయం కలిగిన వారు రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. ఒక కుటుంబంలో కేవలం ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించేందుకు అవకాశం ఉంటుంది. ఏదైనా పథకంలో ఇప్పటికే ఇల్లు పొంది ఉన్నవారు అనర్హులు. అలాగే గృహిణి పేరుతో ఇల్లు మంజూరు చేస్తారు. 560 చదరపు అడుగుల స్థలంలో ఇల్లు నిర్మించాలి.

సకాలంలో పూర్తయ్యేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

జిల్లాలోని అనేకమంది నిరుపేదలు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలు నేటికీ పూర్తికాలేదు. కాంట్రాక్టర్లు బిల్లులు రాలేదన్న సాకుతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో అర్హులైన లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరడంలేదు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

ఎడతెరపి లేని వర్షం..ఇబ్బందులు పడ్డ ప్రజలు



నవతెలంగాణ-కెరమెరి

మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుంది. దీంతో రైతులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పంట చేన్లకు వెళ్లి వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. సామాన్య ప్రజలు సైతం ఇండ్ల నుంచి బయటికి రాలేని దుస్థితి నెలకొంది. మండలంలోని వాగులు, వంకలు, ఒర్రెలు పొంగి పొర్లుతున్నాయి. అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులలలో నీటి ప్రవాహం పెరగటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం రోజంతా ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని పలు వాడల్లో వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువలు నిండి చింత కర్రకు వెళ్లే దారిలోని పలు దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. ఓ కిరాణా దుకాణంలో సుమారు రూ.10 వేల విలువల గల సామాగ్రి తడిసిపోయింది. వైష్ణవి ఆన్‌లైన్ కేంద్రంలో వర్షపు నీరు చేరడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

చుక్కల దుప్పిని వేటాడిన ఐదుగురికి రిమాండ్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

చుక్కల దుప్పిని వేటాడిన ఐదుగురికి రిమాండ్‌కు తరలించామని ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. గత నెల 31న సిర్పూర్ రేంజ్ పరిధిలో గల భూపాలపట్నంకు చెందిన జెల్లా శ్రీనివాస్, కోట శంకర్, నూకల శ్రీనివాస్, బూరం రమేష్, కాషా బోయిన సత్తయ్య చుక్కల దుప్పిని వేట కుక్కలతో వేటారన్నారు. ఈ కేసులో అటవీ శాఖ అధికారులు వారిని అదుపులో తీసుకొని విచారించగా వేటాడినట్లు తెలిసింది. నిందితులను సిర్పూర్ కోర్ట్ జడ్జీ ముందు హాజరుపరిచగా 14 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు.

ఘనంగా చిన్న పొలాల వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పొలాల అమావాస్య మరునాడు జిల్లా కేంద్రంలో నిర్వహించే చిన్న పొలాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కట్టెతో తయారు చేసిన ఎడ్లకు తాళ్ళు కట్టి బ్రాహ్మణవాడ నుంచి గాంధీ చౌక్ దగ్గర గల అంకమరాజు ఆలయం వరకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ వేడుకలు పెద్దల సమక్షంలో చిన్న పిల్లలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైరగడ ప్రతాప్, వైరాగడ మనోజ్, హనూక్, పవన్, చిన్నారులు సాయి ప్రణీత్, రుషి, ప్రత్యక్ పాల్గొన్నారు.

పార్ట్ టైం టీచర్లను తొలగించడం అన్యాయం



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పని చేస్తున్న పార్ట్ టైం టీచర్స్ రెగ్యూలర్ పోస్ట్ స్థానంలో పని చేస్తున్న పార్ట్ టైంగా పని చేస్తున్న టీచర్లు, ఉద్యోగులను తొలగించడం అన్యామని పార్ట్‌టైం ఉద్యోగులు అన్నారు. మంగళవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా రెగ్యూలర్ ఉద్యోగులకు సమానంగా పని చేస్తున్నామన్నారు. అకడమిక్ సంవత్సరం మధ్యలో ఇలా తీసివేయ్యడం బాధాకరమన్నారు. తాము కూడా జోనల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు డెమో ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యి రెగ్యూలర్ టీచర్లతో సమానంగా పని చేస్తున్నామని, ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వల్ల తమ కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. తాము అందించిన సేవలను గుర్తించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి పార్ట్ టైం ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని ఉపసమరించుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్ట్ టైం ఉద్యోగులు మోహన్, మురళి, నారాయణ, రఘు, సుధాకర్, శ్రీనివాస్, దుస్స కుమార్, పుష్పలత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఎస్సీ లబ్ధిదారులకు అందించాలి

• షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం షెడ్యూల్ కులాలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన షెడ్యూల్డ్ కులాల వారికి అందించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, రీసెర్చ్ సభ్యులు వరప్రసాద్, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు, బాధితులకు సత్వర న్యాయం, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఇతర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 338 ప్రకారం రాజ్యాంగబద్ధమైన కమిషన్ ద్వారా షెడ్యూల్డ్ కులాల కుటుంబాల సంక్షేమం కోసం కమిషన్ కృషి చేస్తుందన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలలో జనాభా దామాషా ప్రకారం సంక్షేమ ఫలాలు అందించాలని, వారి అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అట్రాసిటీ కేసులలో పోలీస్ అధికారులు రాజకీయ ఒత్తిడులకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పరిశ్రమల శాఖ పరిధిలో అర్హులైన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు ప్రోత్సాహకం అందించాలని, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడాలని, లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీని పూర్తిస్థాయిలో అందే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలలో ఖాళీగా ఉన్న పోస్టులను బ్యాక్ లాగ్ క్రింద భర్తీకి చర్యలు తీసుకోవాలని, ఉద్యోగాల కొరకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే షెడ్యూల్డ్ కులాల వారి కోసం స్థానికంగానే శిక్షణ కేంద్రాలు, స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారుల సమన్వయంతో షెడ్యూల్డ్ కులాల కుటుంబాల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు సకాలంలో అందించడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యాశాఖ తరపున అమలవుతున్న కార్యక్రమాలను డీఈఓ అశోక్, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, వివిధ కార్యక్రమాలను ఎస్సీ సంక్షేమ అధికారి సజీవన్ తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఫలాలు అందేల అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడిని అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేష్, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కొన్ని రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలతో మహారాష్ట్ర తెలంగాణ మధ్య ప్రవహిస్తున్న పెనుగంగా పరివాహక ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని పెనుగంగ పరివాహక నది తీర సరిహద్దు గ్రామమైన వెంకటరావుపేట వద్ద నది ఉధృతి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరివాహక ప్రాంతంలో ఉన్న వ్యవసాయ రైతులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలని సూచించారు. అధికారులు కూడా నది తీరం, పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పంచాయతీ అధికారులు, పారిశుధ్యం లోపం లేకుండా చూడాలన్నారు. అధికారులు, యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సూచనలు చేయాలన్నారు. ఆయన వెంట నాయకులున్నారు.

గురుకులాలకు సొంత భవనాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులలకు సొంత భవనాలు మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ కోరారు. జిల్లా కేంద్రానికి వచ్చిన జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టళ్ల పరిస్థితులను ఆయనకు వివరించారు. గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.

రుణమాఫీకి వివరాలు అందించడానికి నేడే చివరి తేదీ

నవతెలంగాణ-బెజ్జూర్

రేషన్ కార్డు లేకుండా రుణమాఫీ కానీ రైతుల వివరాలు అందించడానికి బుధవారం చివరి తేదీని ఏఈఓ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో మొత్తం 384 మంది రుణమాఫీ వివరాలు లేవని, ఇప్పటికే 120 మంది తమ వివరాలను అందించి ఫోటో దిగగా 40 మంది రైతులు చనిపోయినట్లు గుర్తించామన్నారు. ఇంకా 100 మందికి పైగా రైతులు తమ వివరాలు అందించాల్సిందని తెలిపారు. వివరాలు అందించాలని ఆయన కోరారు. లేకుంటే వారికి రుణమాఫీ ఆలస్యం అవుతుందని దీన్ని గుర్తించి రైతులు జాబితాలో పేర్లు వచ్చినవారు వివరాల అందించాలని సూచించారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు వైద్య శాఖ అధికారులను కోరారు. మండలంలోని వెంకటరావుపేట్ గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గంగోత్రి జ్వరంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాదిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న అధికారులతో ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల్లో పట్ల వైద్యం, పారిశుద్ధ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వెంకటారావ్‌పేట గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రతి కుటుంబాన్ని వైద్య పరీక్షలు చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్యం లోపం లేకుండా చూడాలని వారికి ఆదేశించారు.

బౌద్ధ విహార్ నిర్మాణానికి నిధులు ఇవ్వండి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో బుద్ధ విహార్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌కు అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభతో పాటు ఇతర సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాంకిడి మండల కేంద్రంలో బౌద్ధ విహార నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని ప్రతి మండలంలో వందల సంఖ్యలో విద్యార్థులు చదువులు పూర్తిచేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. వీరి కోసం ప్రత్యేకంగా లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరారు. వాంకిడి మండలంలోని సరండి, ఖమాన, కనరగాంతో పాటు మండల కేంద్రంలో నాలుగు సంవత్సరాల క్రితం మంజూరైన అంబేద్కర్ భవనాలకు నిధులు మంజూరు చేయడం లేదన్నారు. వెంటనే వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, బౌద్ధ సంఘం అధ్యక్షుడు విలాస్ కొబ్రగడే, నాయకులు విజయ్ ఉప్రే, శ్యామ్ రావు దుర్గం, సందీప్ దుర్గం, రాంటెకె ప్రతాప్, దుర్గం ప్రశాంత్, దుర్గం ప్రదీప్, జాడే మారుతి, గంగుబాయి, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా బొడగ పండుగ



నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు బొడగ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మొదటిరోజు పొలాల అమావాస్యని పురస్కరించుకొని ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం అర్పించారు. అలాగే ఎద్దుల మట్టి ప్రతిమలను తయారు చేసి పూజలు చేసినంతరం మంగళవారం బొడగ పండుగ సందర్భంగా ప్రత్యేక భజన కార్యక్రమాలు చేస్తూ సమీపంలోని వాగులో వాటిని నిమజ్జనం చేశారు. పండుగ సందర్భంగా మాంసం విక్రయ కేంద్రాలు ప్రజలతో కిటకిటలాడాయి.

ఘనంగా భవానీ జాతర

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సరండి గ్రామంలో మంగళవారం భవానీ జాతరను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పొలాల పండుగ తర్వాత రోజు నిర్వహించే జాతరకు మండలంతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, తిర్యాణి, మహారాష్ట్రలోని లకడ్‌కోట్, విరూర్, వరూర్ తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

తగ్గిన వరద ముంపు



నవతెలంగాణ-కౌటాల

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో మండలంలోని పంటలు నీటమునిగాయి. వీర్దండి శివారులోని చాలా మంది రైతుల పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం వరద ముంపు తగ్గడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్తుండడంతో రైతులకు కొంత ఉరట లభించినట్టు అయింది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-జైపూర్



గోదావరి వరదతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించాలని వేలాల శివారు రైతులు డిమాండ్ చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా గోదావరి వరద ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. వరద ఉధృతి పెరిగిన ప్రతి సారి వందల ఎకరాలు వరద నీటిలో మునిగిపోతున్నాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. కాత పూత దశకు వచ్చిన పత్తి పైరు జలదిగ్బందంలో చిక్కుకుందని, సాగు చేసిన పంటలను కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారిందని పేర్కొంటున్నారు. బాధిత రైతుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

అచలాపూర్‌లో ఘనంగా బొడగ పండగ

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ మండలంలోని కాసిపేట, తాండూర్, ఆచలాపూర్ (కొమ్ముగూడెం) గ్రామాల్లో బొడగ పండుగను మంగళవారం రోజున నేతకాని కులస్తులు ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య పండుగ రోజు ఉపవాస దీక్షలు చేసి తరువాత రోజున బొడగ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పండుగను పురస్కరించుకొని బంక మట్టితో ఎడ్లను తయారు చేసి భక్తిశ్రద్ధలతో పూజించి, డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువులలో నిమజ్జనం చేస్తారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

- వీసీ ద్వారా సింగరేణి సీఎండీ బలరామ్



నవతెలంగాణ-జైపూర్

ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి రోజు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశించారు. మంగళవారం సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్‌లతో బొగ్గు ఉత్పత్తిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ ఏడాది ప్రారంభించుకోవల్సిన కొత్త గనులకు సంబంధించి కొత్తగూడెం వీకే ఓపన్‌కాస్ట్, ఇల్లందు రొంపేడు ఓసీ, బెల్లంపల్లి గోలేటి ఓసీ, రామగుండం కోల్‌మైన్ పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఒడిశా రాష్ట్రంలో సింగరేణి సంస్థ ప్రారంభించాల్సిన నైనీ బొగ్గు బ్లాక్‌పై కూడా సమీక్షించిన ఆయన నైనీ బ్లాకు ఉన్న ప్రదేశంలో గల చెట్ల గణన, తొలగింపు జరిపి వెంటనే ఉత్పత్తి ప్రారంభించుకోవాలని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఉత్పత్తి వివరాలపై గనుల వారిగా సమీక్షించారు. ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని, అదేవిధంగా రోజుకు 14 లక్షల ఓవర్ బర్డెన్ తొలగింపుకు తగు విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ శాఖల సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రభుత్వ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లక్షెట్టిపేట ఎంపీడీఓ సరోజ అన్నారు. మండలంలోని జెండవెంకటాపూర్ గ్రామలోని రైతు వేదికలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధునిక ప్రపంచానికి దూరంగా ఉన్న తోటి తెగకు చెందిన ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తుందని, ఇందులో భాగంగానే తోటి తెగ గిరిజనులకు స్పాట్ లోనే బ్యాంకు ద్వారా రుణం ఇవ్వడానికి ఈ పథకం ద్వారా జీరో అకౌంట్ ఓపెన్ చేస్తారని, మీసేవ ద్వారా ఆధార్ కార్డ్ లేని వారికి ఆధార్ కార్డ్ జారీ చేస్తారని చెప్పారు. విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఐదుగురికీ కొత్త ఆధార్ కార్డులకు దరఖాస్తు చేయించారు. ఫింగర్ ప్రింట్స్ రాకపోవడంతో మరో కొందరికి ఆధార్ అప్లోడ్ కాలేదని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం, స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ రఘునాథం, ఏపీఓ వెంకట రమణ ,పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

బుడగ జంగాల కాలనీని సందర్శించిన గిరిజన కార్పొరేషన్ చైర్మన్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో కురుస్తున్న వర్షాలకు వాగు ఉప్పొంగి ఇళ్లలోకి నీరు చేరడంతో ఆ కాలనీని తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కోట్నాక తిరుపతి మంగళవారం సందర్శించారు. కాలని వాసులతో మాట్లాడారు. కాలనీలో రోడ్లు విద్యుత్తు సౌకర్యాలు లేవని తమను ఆదుకోవాలని కాలనీవాసులు చైర్మన్‌ను కోరారు. స్పందించిన చైర్మన్ కాలని సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని ఆ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం కాలనివాసులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయనను కాలని వాసులు శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాటు కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సోహెల్ షా, జిల్లా అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ఊరే సాయికుమార్, మహమ్మద్ ఎజాసొద్దీస్, బొంతల చందు, పేంద్రం రాజేశ్వరరావు, నయన్ పాషా, ప్రసాద్, దాసరి తిరుపతి, సృజన్, మేకల అక్షయ్ కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ బాధితునికి అప్పగింత

నవతెలంగాణ-తాండూర్

పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను మంగళవారం తాండూరు పోలీసులు బాధితునికి అప్పగించారు. బెల్లంపల్లికి చెందిన ఢీకొండ తిరుపతి తన మొబైల్ ఫోన్ పోయిన విషయాన్ని గత ఫిబ్రవరిలో తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి బాధితునికి అప్పజెప్పడం జరిగిందని ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఎవరైనా సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవలని తెలిపారు. పోర్టల్ ద్వారా మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉందని చెప్పారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టును సీఎం ప్రారంభిస్తారు

- ప్రాజెక్ట్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-హాజీపూర్

ఎల్లంపల్లి ప్రాజెక్టును త్వరలో అధికారికంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఇరిగేషన్ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి మంత్రి ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఎంత ఇన్‌ఫ్లో.. అవుట్ ఫ్లో ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వరదల వల్ల ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును అధికారంగా ప్రారంభించలేదని త్వరలోనే ప్రాజెక్ట్‌కు వచ్చే రహదారిని మరమ్మతులు పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రాజెక్ట్ వచ్చే పర్యాటకుల కోసం విశాలమయిన పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే రెండు మూడు రోజుల్లో అధిక వర్షాలు పడనున్నాయని ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఎలాంటి సంఘటనలు జరగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎంతో పాటు మంత్రులు భారీ వర్షాల పడుతున్న ప్రాంతాలలో ప్రజలకు ధైర్యం చెప్పడంతో పాటు, అధికారులను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 32 గేట్ల ద్వారా 5 లక్షల క్యూ సెక్కుల పైగా దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువనున్న ధర్మపురితో పాటు ఇతర ప్రాంతాలకు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూస్తున్నామన్నారు. మహారాష్ట్రలో పడే వర్షాల వల్ల ఎగువనున్న శ్రీ రాం సాగర్ ప్రాజెక్ట్ నుంచి దిగువనున్న మేడిగడ్డ వరకు వరద ప్రవాహంతో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందన్నారు.



డ్రగ్స్ వినియోగించినా.. విక్రయించినా కఠిన చర్యలు

- రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

నవతెలంగాణ-మంచిర్యాల



మాధక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని, డ్రగ్స్, గంజాయి విక్రయించినా.. సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రెడ్ క్రాస్ సొసైటీ ఆనంద నిలయంలో ఏర్పాటు చేసిన మత్తు 'పదార్థాలపై అవగాహన' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని, యువత వాటికీ దూరంగా ఉండాలని సూచించారు. గుట్కా, డ్రగ్స్, గంజాయి అమ్మేవారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా గంజాయి వినియోగం, రవాణాకు పాల్పడితే తీవ్రమైన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో పలుసార్లు గంజాయి సేవిస్తూ , విక్రయిస్తూ పట్టు బడిన నిందితులతో ఇంకోసారి గంజాయి సేవించమని, సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా పని చేస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం ఆనంద నిలయంలో ఉండే వృద్ధులకు, అనాధ పిల్లలకు దుప్పట్లు, పండ్లు పంపిణి చేశారు. ఆశ్రమం ఆవరణలో పూల మొక్కలు నాటారు. అవగాహనా కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు ఆర్ ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవి కుమార్, మంచిర్యాల, లక్షెట్టిపేట్, రురల్ సీఐలు బన్సీలాల్, ఆశోక్ కుమార్, నరేందర్ పాల్గొన్నారు.



కమీషన్ల కోసం కాళేశ్వరం బ్యారేజ్ నిర్మించారు

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్



మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కమీషన్లకు కక్కుర్తిపడి కాళేశ్వరం బ్యారేజ్ నిర్మించారని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి విమ్మర్శించారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు నిర్మిస్తే రూ.33 వేల కోట్లతో పూర్తయ్యేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం అన్నారం బ్యారేజ్‌ను ఆయన సందర్శించారు. కరకట్టల నిర్మాణంతో బ్యారేజ్ బ్యాక్ వాటర్‌తో ముంపుకు గురవతున్న పంట పొలాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో ఇప్పటికే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా పంటల నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కమీషన్ల కోసం మేడిగడ్డ వద్ద బ్యారేజ్ నిర్మించి మంచిర్యాల, చెన్నూర్, మంథని, భూపాల్‌పల్లి నియోజకవర్గాలలో వేలాది ఎకరాల్లో పంట పొలాలు మునిగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని విమ్మర్శించారు. రూ.1 లక్ష 25 వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం బ్యారేజ్‌తో కేసీఆర్‌కు కమీషన్లు, కాంట్రాక్టర్లు ప్రపంచ ధనవంతులుగా మారారని అన్నారు. అన్నారం బ్యాక్ వాటర్ పుణ్యమాఅని చెన్నూర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంట పొలాలు గత నాలుగు సంవత్సరాలుగా మునిగిపోతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. ముంపు బాధితులను కనీసం పరమార్శించని గత ప్రభుత్వం కాంగ్రెస్‌ను విమ్మర్శించడం విడ్డూరమని అన్నారు. కేటీఆర్‌కు కనీస అవగాహణ లేకుండా పోయిందని కాళేశ్వరం పంపులను ఆన్ చేయ్యకుంటే 50 వేల మందితో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇప్పుడున్న పరిస్థితులను కేటీఆర్ వచ్చి చూస్తే తెలుస్తుందని, అన్నారం, ఎల్లంపల్లి ప్రాజెక్టు వాటర్ ఎటు వెలుతుందో తెలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బ్యాక్ వాటర్ వల్ల పంటలు నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికి కార్యచరణ తయారు చేసిందని, ముందుగా కరకట్ట నిర్మాణానికి మొదటి ప్రాధనత్య ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రెజర్ కమిటీ మరింత అద్యయనం చేసి కరకట్టల నిర్మాణాలపై పూర్తి నివేదిక తయారు చేసే పనిలో ఉన్నదని అన్నారు. బ్యాక్ వాటర్ ముంపు బాధితులను ఆదుకోవడానికి ఎప్పుడు సిద్ధంగానే ఉన్నానని రైతులకు భరోసా కల్పించారు.

డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా చర్యలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డెంగ్యూ జ్వరాలు ప్రభలకుండా నివారణ చర్యలు చేపట్టారు. వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దోమల మందును పిచికారీ చేసినట్లు, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆంటీ లార్వా మందును స్ప్రే చేయించినట్లు వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మల్లారెడ్డి, ప్రాధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీజ, హెల్త్ అసిస్టెంట్‌లు గఫూర్, ఇసాక్, ఏఎస్ఎంలు విజయ, సుజాత ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

బోయపల్లిలో పోషణ మాసం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని బర్లగూడెం, బోయపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ స్కూల్ పిల్లలకు పుస్తక పఠనం వినిపించిన అనంతరం సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ సెప్టెంబర్ మాసంలో జరిగే పోషక మాసం కార్యక్రమంలో గర్భిణీలకు పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు ఆరోగ్య కమిటీల ద్వారా సమతుల్య ఆహారం సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కమిటీల్లో గ్రామస్తులతో పాటు కమిటీ సభ్యులు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.



శ్యాంసుందర్‌రావుకు ఉత్తమ రైతు అవార్డు

- అగ్రికల్చర్ కమిషనర్‌తో అవార్డు స్వీకరణ



నవతెలంగాణ-హాజీపూర్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ యూనివర్సిటీ వ్యవసాయ విద్యాలయ 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లాకు చెందిన హాజీపూర్ మండల ఎఫ్‌పీసీ సలహాదారు గోనే శ్యామ్ సుందర్‌రావుకు ఉత్తమ తెలంగాణ రాష్ట్ర రైతు అవార్డు అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చరల్ కమిషనర్ రఘునందన్ రావు చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా అగ్రికల్చరల్ కమిషనర్‌కు హ్యాజీపూర్ ఎఫ్‌పీసీకి వడ్ల కొనుగోలు కేంద్రం, ఫెర్టిలైజర్ కోసం రవాణా సదుపాయం సొసైటీల తరహాలో ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాజీపూరు ఎఫ్‌పీసీ డైరెక్టర్ లు పుస్కూరి శ్రీనివాస రావు, బొడ్డు శంకర్ పాల్గొని అవార్డు గ్రహీతను శాలువాతో సన్మానించారు.

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకొని భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కాసిపేట ప్రభుత్వ పాఠశాల ప్రదానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగే రీడింగ్‌లో బాగంగా రీడ్ ఎ తాన్ ప్రోగ్రాంనిర్వహించారు. పిల్లల చేత, ఉపాధ్యాయుల చేత, కమ్యూనిటి చేత పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠన వలన విద్యార్థుల్లో ఆలోచన శక్తి, ఊహ శక్తి, సృజనాత్మకతను పెంచుకో వచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు, రూమ్ టూ రీడ్ సభ్యులు శ్రీనివాసాచారి పాల్గొన్నారు. మాదారం టు పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి పిల్లల చేత పుస్తక పఠనం చేయించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-వేమనపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డితో కలిసి మండలంలో పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, ఆశ వర్కర్లతో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం అయి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాలు ఉన్న కారణంగా మండల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్య పనులను నిర్వహించాలని, ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఫాగ్గింగ్ చేయించాలని సూచించారు. అనంతరం నీల్వాయి గ్రామపంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి, మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ఆగిపోయిన పనుల గురించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి అక్కడి భోజన వసతులు గురించి స్పెషల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు.

అంజి బాబు వర్ధంతి సందర్భంగా అన్నదానం

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొండు అంజిబాబు నాలుగవ వర్ధంతి సందర్భంగా మంగళవారం కుటుంబ సభ్యులు తాండూర్ ఐబీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌గా సేవలు అందిస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం వర్ధంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు సతీమణి శ్రావణి, సోదరి కృష్ణవేణి, స్థానికులు దత్తు దొర, ఆలయ కమిటీ చైర్మన్ ఎలుక రామచందర్, పెరుక రాజన్న, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్, చింటూ, స్నేహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని కర్జెల్లి, బాలాజీ అనుకోడ గ్రామాలలో కోడిపందెలు నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. కర్జెల్లి గ్రామంలో వాగ్మారే నారాయణ, రౌతు సుధాకర్, ఎలకరి శంకర్, తెరిగే పాపయ్య, నాయిని మరయ్య, బుర్రి నీలయ్య, మేకల పుల్లయ్య, బాలాజీ అనుకోడ గ్రామంలో ఎల్ములు రాజు, జునుగరి రాజన్న, మనేపల్లి పురుషోత్తం, దుర్గం శ్యామ్ రావు, సాయి కిరణ్ మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి తొమ్మిది కోడి పుంజులు, ముప్పై కత్తులు, రూ.2880 నగదును స్వాధీన చేసుకొని పలువురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయనతో పాటు దాడిలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న నిందితుల పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని దస్నాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి నిందితులను పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. మండలంలోని దస్నాపూర్ గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా పేకాట ఆడుతున్న హౌర్ రమేష్, కవాల్కర్ ఆకాశ్, మెంగ్రె సంజీవ్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.8,100 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమో చేసినట్టు తెలిపారు. జిల్లాలో పేకాట, మట్కా, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ రాణప్రతాప్ హెచ్చరించారు. ఇలాంటి వాటిపై సమాచారం పోలీసులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్ కుమార్, పీసీలు సంజీవ్, దేవేందర్ పాల్గొన్నారు.

పెరుగుతున్న వీధి కుక్కలు



నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలో వీధి కుక్కలు పెరుగుతున్నాయి. కుక్కల నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాండూర్ ఐబి చౌరస్తా వద్ద వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బాటసారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంట పరుగులు పెడుతున్నాయి. కుక్కల అరుపులకు స్థానికులు బెంబేలెత్తుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ ఉదయాన్నే స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు అడ్డుపడుతున్నాయి. దీంతో రోడ్డు మీద నడవడనానికి అందరూ ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలు గ్రూపులుగా నడిరోడ్డుపై కొట్లాడుకోవడంతో షాపుల యజమానులకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయి. కుక్కకాటుతో జరిగే అనర్థాలను గ్రహించి పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-బేల

రైతుల పక్షాన ప్రశ్నించాల్సిన బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ కాంగ్రెస్ నాయకులతో మంతనాలు జరపడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని పెన్‌గంగా నది పరివారక ప్రాంతంలో భారీ వర్షాలతో నీట మునిగిన పంట పొలాలను స్థానిక రైతు బాధితులతో కలిసి మాజీ మంత్రి జోగు రామన్న పరిశీలించారు. పంట పొలాలల్లో తిరుగుతూ పంట నష్టపోయిన తీవ్రతను రైతులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన ఉండటంతో కాస్త రైతులకు ఉపయోగపడే హామీలు ఇస్తారేమోనని ఎదురుచూసిన రైతులకు నిరాశకు గురి చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ రైతుల పక్షాన నిలబడాల్సింది పోయి అధికార పార్టీ మంత్రులతో కమిషన్లు వస్తాయేమో అన్న భ్రమలో రైతాంగ సమస్యలను పక్కన పెట్టి సీసీఐ పరిశ్రమ పట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేలతో చేయి కలపడం, రైతాంగానికి తీవ్ర అనుమానాలు రేకెత్తిస్తుందన్నారు. రైతులకు అందాల్సిన రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12వేలు రైతు రుణం అందించేందుకు స్థానిక బీజేపీ నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం పలు అనుమానాలకు తావీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ ప్రమోద్‌రెడ్డి, సీనియర్ నాయకులు రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, దేవన్న, జక్కుల మధుకర్, జితేందర్, సతీష్ పవార్, మంగేష్ ఠాక్రే, విపిన్ ఖోడే, సునీల్ గోడం, విశాల్ గోడే, చౌహాన్ సుధాకర్, రైతులు ఉన్నారు.

వరద నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

నవతెలంగాణ-బోథ్

నది వరద పరివాహక ప్రాంతాల్లో పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులతో సర్వే చేసి, ప్రభుత్వానికి పంపించేందుకు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు రోడ్డును పరిశీలించారు. అలాగే భారీ వర్షాల వల్ల నది పరివాహక ప్రాంతాల్లో పంట నష్టం అయినా రైతులకు తక్షణమే వ్యవసాయ అధికారులు పంటల వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. చరవాణి ద్వారా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలిపిపారు. వెంటనే వర్షాలు తగ్గుముఖం పట్టగానే నూతన కల్వర్టుల మంజూరు చేసి, రూ.2లక్షలతో మరమ్మత్తు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్మ వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాళ్ల ఇంద్రారెడ్డి, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ అబుద్, నితిన్, సోయల్ పాల్గొన్నారు.

25న యువజనోత్సవ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 25న యువజనోత్సవ జిల్లాస్థాయి పోటీలు వివిధ అంశాల్లో నిర్వహిస్తున్నట్టు డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనేవారు జిల్లాకు చెందినవారై, 15సంవత్సరాల నుంచి 29సంవత్సరాల లోపు ఉన్న యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఫోక్ డ్యాన్స్ గ్రూప్, సోలో, ఫోక్ సాంగ్ గ్రూప్, సోలో, కవిత్వం, స్టోరీ రచన, పెయింటింగ్, డిక్లమేషన్, హ్యాండీ క్రాఫ్ట్, టెక్స్‌టైల్, అగ్రోప్రొడక్ట్ అంశాలుంటాయని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్‌నెంబర్ 9440843848, 9381303380 సంప్రదించాలని తెలిపారు.

పశువుల సమస్యలపై సమాచారం ఇవ్వాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని భారీ వర్షాలలు వరదల కారణంగా పశువులకు ఏవైనా ముప్పు జరిగితే, చనిపోతే అటువంటి సమాచారాన్ని మన అందుబాటులో ఉన్న పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పశువైద్యాధికారి జీవన్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. సాంప్రదించాల్సిన నెంబర్లు, 8317599983, పి.నరేష్ 9848 489936, వాంకిడి గ్రామం వారు సాంప్రదించాల్సిన నెంబర్లు, సుశీల్ కుమార్ 9502790709, జంగు 8074429759, తర్నం గ్రామం వాళ్ళ సంప్రదించాల్సిన నెంబర్ వేణు కుమార్, 9490561478, ఏ.రాజన్న 9908817243లను సాంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శశికళ, ఉసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. జన్నారం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు, కిశోర బాలికలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రాహుల్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సరస్వతి పాల్గొన్నారు.

వివరాలు సేకరణకు దగ్గర పడుతున్న సమయం

- నేడే చివరి తేదీ
- 384కు గాను 170 పూర్తి
- సమయం పెంచాలని కోరుతున్న రైతులు
- స్పష్టత లేని చనిపోయిన రైతుల వివరాలు

నవతెలంగాణ-బెజ్జూర్

రుణమాఫీ కాని రైతుల వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం వారం రోజుల క్రితం చేపట్టిన కార్యక్రమం నేటితో ముగియనుంది. అర్హులై ఉండి రేషన్ కార్డు లేక, ఇతర కారణాల వల్ల మాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరించి వారికి ఇచ్చిన ప్రత్యేక యాప్ రైతు భరోసా పంట రుణమాఫీ యాప్'లో నమోదు చేస్తున్నారు. నమోదు అనంతరం రైతుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని, స్థానిక పంచాయతీ కార్యదర్శి సంతకం తీసుకుంటున్నారు. రైతుల సౌకర్యార్థం రైతు వేదికల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి వివరాలను సేకరిస్తున్నారు.

ఫోటో తీయాలి సెల్ఫీ దిగాలి...

పంట రుణం ఉన్న రైతు ఇంటిని ఏఈఓ సందర్శించి రైతు వెల్లడించిన కుటుంబ సభ్యులు వివరాలను ఆధార్ నెంబర్‌తో సహా నమోదు చేసుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ మండలాలను కేటాయించకూడదు. మండల స్థాయిలో నియమితులైన వారికి వివరాలను వెంటనే రుణమాఫీ విభాగానికి సమర్పించాలి. ఏఓ రుణమాఫీ లాగిన్‌లో కుటుంబ సభ్యుల వివరాలను అప్‌లోడ్ చేయడానికి మొబైల్ యాప్ అభివృద్ధి చేయడం జరిగింది. మండలాల్లోని అన్ని బ్యాంకు బ్రాంచిల వారీగా కుటుంబ సభ్యులను నిర్ధారించి రుణం పొందిన రైతుల జాబితా ప్రదర్శించాలి. రుణం పొందిన రైతు జీవిత భాగస్వామి వివరాలను నమోదు చేయాలి. జీవిత భాగస్వామి వివరాలను నమోదు చేసిన తర్వాత ఇతర కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలి. కుటుంబ సభ్యులు ఆధార్ నెంబర్‌తో పాటు వారు వయస్సు నమోదు చేయాలి. కుటుంబ పెద్దతో ఫోటో తీయాలి రైతు సమర్పించే అఫీడెవిట్‌లో అతను అందించిన కుటుంబ సభ్యుల వివరాలు ఏ ప్రభుత్వ అధికారి అయిన లేదా పంచాయతీ కార్యదర్శి లేదా ఏఈఓ లేదా ఏఓ ధృవీకరించాలి. రైతులు సమర్పించిన ఆఫిడవిట్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. డేటా సేకరణ సమయంలో అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు రుణం పొందిన రైతులతో ఏఓ సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా మార్గదర్శకాలను ప్రభుత్వం రూపొందించింది. అప్‌లోడ్ చేసిన డేటా నేరుగా సంబంధిత అధికారులకు వెళ్లడంతో అర్హులైన రైతులకు రెండు లక్షల రూపు రుణాన్ని అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.



రైతు వేదికలో వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వివరాల సేకరణకు దగ్గర పడుతున్న సమయం..

రేషన్ కార్డు లేకపోవడంతో ఆధార్ బ్యాంకు అకౌంట్‌లో తప్పిదాలు సాంకేతిక కారణాలతో రెండు లక్షల వరకు రుణమాఫీ కానీ రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలను చేపట్టారు. ఇప్పటికే వారం రోజుల నుండి సర్వే చేస్తున్నారు. అయితే వివరాలు అందించేందుకు సమయం దగ్గర పడుతుంది. మండలంలో ఇప్పటికీ 384 మంది రైతు కుటుంబాల వివరాలు సేకరించాల్సి ఉండగా 1074 మంది రైతు కుటుంబాల వివరాలను అధికారులు యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఇంకా కొంతమంది వివరాలను సేకరించాల్సి ఉంది. వివరాలు సేకరణ కోసం సమయం దగ్గర పడుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. మండలం యూనిట్‌గా రైతుల వివరాలను సేకరిస్తున్నారు. అనేకచోట్ల వివరాలను సేకరిస్తున్న రైతులు మాత్రమే ఇంకా గంగరగోళంగానే ఉన్నారు. రూ.2 లక్షలపైన రుణం ఉన్న రైతులు రుణమాఫీ విషయంపై నిలదీస్తున్నారు. రూ.2 లక్షలపై ఉన్న సొమ్ము బ్యాంకుల్లో చెల్లించాలా వద్దా అని అడుగుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేకపోతున్నారు

రైతు సమర్పించాల్సిన అఫిడవిట్ ఇది...

కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం నేను ఇస్తున్న కుటుంబ సభ్యులు వివరాలు వాస్తవం. సరైనవి రుణమాఫీ పొందడానికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గుర్తించిన లేదా మోసపూరితంగా పంట రుణాన్ని పొందినట్లు తేలిన పంట రుణమాఫీకి అర్హత లేదని నిర్ధారణ అయిన పొందిన రుణమాఫీ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించడానికి అంగీకరిస్తున్నాను. ఈ మొత్తం రికవరీ చేయడానికి చట్ట ప్రకారం వ్యవసాయ శాఖ సంచాలకుల వారికి అధికారం ఉంటుంది. ఇది రెండు లక్షల వరకు రుణమాఫీ కానీ రైతుల రుణమాఫీ కోసం ఇవ్వాల్సిన అఫిడవేట్ ఇలా అఫిడివేట్ కోరడంతో పాటు రుణమాఫీ 2024 బ్యాలెన్స్ ఉన్న రైతు కుటుంబాలకు సంబంధించిన మార్గదర్శకాలను వ్యవసాయ శాఖ జారీ చేసింది. రుణమాఫీ కానీ రైతులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. మార్గదర్శకాలకు రైతులు ఇవ్వాల్సిన అప్డేట్‌ను జత చేసింది.

స్పష్టత లేని చనిపోయిన రైతుల వివరాలు

రేషన్‌కార్డు లేని రైతుల వివరాలను సేకరిస్తున్న ప్రభుత్వం చనిపోయిన రైతుల వివరాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అర్హులై రుణామాఫీ కానీ రైతుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చిన ప్రభుత్వం చనిపోయిన రైతుల వివరాల సేకరణకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆ రైతుల నమోదు సమస్యగా మారే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం మార్గదర్శలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

20న జాతీయ హిందీ దినోత్సవ కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందీ భాష సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 20న ఉదయం 11గంటలకు హిందీ దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మాజీ మంత్రి జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమానికి ఆహ్వానించగా జాతీయ భాష సేవలో హిందీ భాష సేవాసమితి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. గత సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా కార్యక్రమానికి హాజరయ్యే వాళ్లందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఇటీవల పదోన్నతి పొందిన 85 మంది హిందీ ఉపాధ్యాయులతో పాటు 15 మంది హిందీలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని సన్మానించనున్నట్లు సుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందీ భాష సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.దత్తాత్రేయ, ఉపాధ్యక్షులు రవి జాబడే, ప్రచార కార్యదర్శి ఆర్.సాంబన్న, కార్యవర్గ సభ్యులు జావిద్ అలీ పాల్గొన్నారు.



మాజీ మంత్రి జోగు రామన్నను ఆహ్వాన పత్రిక అందిస్తున్న హిందీ భాషా సేవా సమితి అధ్యక్షుడు సుకుమార్

ఘనంగా బొడగ పండగ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పొలాల అమావాస్య మరునాడు నిర్వహించే బొడగ పండగ మండలంలోని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో రైతులు మట్టితో చేసిన ఎడ్లను ప్రత్యేకంగా పూజలు చేసి ఊరంతా తిరుగుతూ ప్రతి ఇంటిని వేడుకల్లో భాగం చేశారు. పోచమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కూలిన శత సంవత్సర వృక్షం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని నూర్‌నగర్‌లో ఉన్న 100 సంవత్సరాల చరిత్ర కలిగిన వృక్షం పడిపోయింది. దానికి దగ్గరలో ఉన్న వృద్ధులు చెట్టు గురించి చెప్పుకోవడం కనిపించింది. అంతపెద్ద వృక్షం పడిపోవడంతో మున్సిపాల్ సిబ్బంది అక్కడికి వచ్చి వృక్షాన్ని తొలగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం : డీఎస్పీ

- ఘనంగా డాక్టర్ కళ్లెం వెంకట్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- మహిళలకు కుట్టుమిషన్‌ల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జన్మదినం సందర్భంగా ఆర్భాటలకు వెళ్లకుండా సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు కళ్లెం వెంకట్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కళ్లెం భూమారెడ్డి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమానికి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్ల నారాయణరెడ్డితో కలిసి డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహిళలకు కుట్టమిషన్లను పంపిణీ చేశారు. అనంతరం వివిధ సామాజిక కార్యక్రమాల్లో రాణిస్తున్న ఉపాధ్యాయులను డీఎస్పీ సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ చాలా మంది తమ జన్మదినాలను అర్భాటలకు వెళ్లి డబ్బులను వృధా చేస్తున్నారన్నారు. కానీ పట్టణానికి చెందిన వైద్యుడు వెంకట్ మాత్రం తన పుట్టిన రోజు సందర్భంగా పేద మహిళాలకు ఉపాధి కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గత పుట్టిన రోజు సందర్భంగా కూడా 50 సైకిళ్లను పంపిణీ చేశారని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్నీ సేవ కార్యక్రమాలను చేపట్టాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కళ్లెం భూమారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, బోరంచ శ్రీకాంత్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కళాశాలలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల(బోథ్) ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి తమ కళాశాలలో బిజెడ్‌సిలో ఏడు, బీఏ మూడు, బిఎస్సి ఫిజికల్ సైన్స్ 27, బికాం 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 4, 5 తేదీల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని సూచించారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9849390495 నెంబరును సంప్రదించాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్



గత నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈఓ గణపతి సూచించారు. మంగళవారం మండలంలోని కిష్టాపూర్, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామ పంచాయతీలను సందర్శించిన ఆయన గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. దోమలు, ఈగలతో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని. గ్రామాల్లో పాగింగ్ చేయించాలని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వర్షాల కారణంగా శిథిలమైన నివాసాల్లో ఉండకూడదని, కరెంట్ స్థంబాలు, నానిపోయిన గోడలకు దూరంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు తెలిపారు. అదేవిధంగా వర్షాకాలంలో వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ఆయన తెలిపారు.

ఉట్నూర్ మండలంలో భారీ వర్షం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారం, శ్యామ్‌పూర్, పులిమడుగు, హస్నాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. మూడు రోజుల నుంచి వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు బుధవారం ఉదయం నుంచి కాస్త వర్షం విరామం ఇవ్వడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కానీ రెండు గంటల నుంచి అతి భారీ వర్షం పడటంతో కాలువలు, నాళాలు, పొంగిపొర్లాయి.

యువతిని వేధించిన యువకునికి జైలు

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఎడ్లన్నోళ్ల శ్రీనివాస్(36) అనే యువకుడు 2018 సంవత్సరంలో ఒక యువతి బహిర్భూమికి వెళ్ళే సమయంలో వెంటాడి అఘాయిత్యానికి పాల్పడే ప్రయత్నం చేశాడు. యువతి అతని బారి నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లి తన కుటుంబ సభ్యులతో తెలుపగా వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణాధికారి ఎస్సై హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, సాక్షులను కోర్టులు హాజరు పరుచగా న్యాయమూర్తి ఆర్.అజయ్ కుమార్ నిందితునికి 3 నెలల సాధారణ జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధించాడు.

జెడ్పీ సీఈఓకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జెడ్పీ సీఈఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌రెడ్డిని మంగళవారం టీఎన్‌జీఓ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వాటిని పరిష్కరించాలని, అదేవిధంగా కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. సీఈఓను సన్మానించిన వారిలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల నవీన్, నాయకులు తిరుమల్‌రెడ్డి ఉన్నారు.

గిరి గ్రామాల్లో ఘనంగా బోడగా పండగ

నవతెలంగాణ-నార్నూర్

పొలాల అమావాస్య తర్వాత రోజు వచ్చే బోడగా పండుగను మంగళవారం గిరిజన ఆదివాసీ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాల ప్రకారం పురుషులు గ్రామ సమీపం శివారు పొలిమేరలో పిండివంటలతో తయారు చేసిన నైవేద్యాన్ని అర్పించి భోజనాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేళ్ల పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఇంటర్ పాసైన విద్యార్థిని, విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు స్పెషల్ డ్రైవ్ కింద ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి 9వ తేదీ వరకు దోస్త్‌లో ఆన్‌లైన్‌లో స్పెషల్ డ్రైవ్ ఫేస్ మిగిలిన సీట్లకై దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 11న సిట్ అలాట్మెంట్, 13 వరకు సెల్ఫ్ రిపోటింగ్ చేయాలని పేర్కొన్నారు. ఫస్ట్, సెకండ్, థర్డ్ ఫేస్‌లలో సీట్లు రానీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేయాలనీ, ఇతర వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బదిలీపై వెళ్లిన ఏఈఓకు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామ ఏఈఓ వాజిత్‌ను మంగళవారం సొనాల గ్రామప్రజలను సన్మానించారు. తమ గ్రామంలోని పది సంవత్సరాల పాటు పనిచేసి, ఇటీవలనే బదిలీపై వెళ్లిన ఏఈఓ వాజిద్‌ను అలాగే ఇటీవల నూతనంగా వచ్చిన ఏఈఓ ఉమారాణిను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గుడాల శేఖర్, బిజ్జూరి గంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.